


"జయంతీ! త్వరగా బయలుదేరండమ్మా! అప్పుడే చీకటిపడి పోతోంది." వంటింట్లోంచి బిగ్గరగా అంది మీనాక్షమ్మ.

"నేను రడీ! నీదే ఆలస్యం జయా!" అంది జయంతి చెల్లెలు లత.

"నా ఆలస్యం కూడా ఏం లేదు. పద వచ్చేస్తున్నాను." టేబులు పైన వున్న కుంకుమభరిణ చేతులలోకి తీసుకుంటూ అంది జయంతి.

"అదేమిటే జయా! పేరంటం పిలవడానికి ఆ భరిణె ఏం బాగుంటుంది. ఒక్క నిమిషం వుండు" అంటూ బీరువాలోంచి వెండి కుంకుమభరిణె తీసుకువచ్చి జయంతి చేతులలో పెట్టింది మీనాక్షమ్మ.

ఇద్దరూ బయలుదేరబోతూంటే పని ముగించుకు వచ్చిన వాళ్ళ పనిమనిషి కుంకుమ భరిణె చూచి "చాలా బాగుందమ్మగారు" అంది వాళ్ళ దగ్గరగా వచ్చి.

"అలాగా!" అంటూ జయంతి చేతులలో నుంచి కుంకుమ భరిణె తీసి పనిపిల్లకు అందించింది లత. కాసేపు కన్ని రెప్ప వెయ్యకుండా చూచి, "భలే బాగుందమ్మగారు!" మళ్ళీ అంది పనిపిల్ల.

పన్నెండేళ్ళు నిండని దాని కళ్ళకు అన్ని వస్తువులూ ఎంతో వింతగా కనిపిస్తాయి. కంటికి నచ్చిన ఏ వస్తువైనా మరీ మరీ చూడాలని, ముచ్చటగా చేతులలోకి తీసుకోవాలని ఉబలాట పడుతోంది దాని పసి హృదయం. సంస్కారం పాలు కాస్త ఎక్కువగా ఉన్న లతకు తెలుసు దాని మనస్సు. అందుకే భరిణె దాని చేతులలో పెట్టి కాస్సేపు ముచ్చటలాడుతోంది. "లక్ష్మి, మూత తీసి భరిణెలోని కుంకుమతో నాకు బొట్టు పెట్టు" అన్న లత మాటలకు చెంగున గంతేసింది లక్ష్మి. అది లత నుదుట బొట్టు పెడుతోంటే చూసిన మీనాక్షమ్మకు ఒళ్ళు మండింది.

"పనిపిల్లతో ఏమిటా ముచ్చట్లు. హద్దూ పద్దూ వుండక్కర్లే." మీనాక్షమ్మ మాటకు బెదురు చూపులు చూస్తూ నెమ్మదిగా కుంకుమభరిణె లత చేతిలో పెట్టేసి వెళ్ళిపోయింది లక్ష్మి.

పేరంటానికి పిలవటానికి వెళ్ళిన లత మనస్సులో ఆ సంఘటనే మెదులుతోంది. అమ్మ కేకలకు లక్ష్మి ఎంత బెదిరిపోయిందో

పాపం! లక్ష్మిపట్ల సానుభూతితో వుండి పోయింది లత మనస్సు.

మరునాడు జయంతి కొడుకు పుట్టిన రోజు. ఇల్లంతా హడావిడిగా వుంది. పేరంటానికి వచ్చిన వాళ్లందకి ఆ వెండిభరిణెలోని కుంకుమ బొట్టు పెడుతుంటే లక్ష్మి గుర్తుకువచ్చి బాధగా అనిపించింది. అమ్మ ఒక్క కసురు కసరగానే బెదిరి పోయింది పిచ్చిపిల్ల. మరి తనవైపుకే రాలేదు. భరిణె కాస్సేపు దాని చేతులలో వుంటే ఏమైపోతుంది. ఏమిటో ఈతత్వాలు. అది పనిమనిషి అయినంత మాత్రాన అంత చులకనగా చూడాలా. ఆలోచిస్తూనే వుంది లత.

అక్కయ్య ఊరు వెళ్లిపోవటం, తనకు కాలేజీ తెరచేయటం జరిగిపోయినా ఆ సంఘటన మాత్రము మరచిపోలేక పోయింది లత. లక్ష్మి ఎప్పటిలా పనిచేసుకు పోతోంది. ఆ రోజు లత కాలేజీ నుంచి వచ్చేసరికి మీనాక్షి దేనికోసమో వెతుకుతోంది. లతని చూస్తూనే "వెండి కుంకుమభరిణె ఎక్కడ పెట్టావు!" కాస్త చికాకుగా అంది. లత ఉలిక్కిపడింది. "పేరంటం అయిపోయాక టేబిలుమీదనే పెట్టేసాను. ఈ నాలుగురోజులుగా దాన్ని మళ్లీ నేను చూడలేదు." అంది.

"గంటసేపటి నుంచి వెతికి చస్తున్నా. అన్నీ ఉన్నాయికాని ఈ భరిణె కనిపించడం లేదు. ఎక్కడ పెట్టేవో కాస్త గుర్తు తెచ్చుకో."

మీనాక్షమ్మ మాటలకు ఏదో గుర్తు వచ్చిన దానిలా లత అంది. "అక్కయ్య ఊరెళ్లిపోయేరోజు నానిగాడు ఆ భరిణెతో ఆడుకోవడం చూసేను. ఎక్కడ పడేసేడో ఏమో !"

"బాగుందే నీ మాట. ఆ పసి నాగన్న ఏం చేస్తాడు. ఇది ఆ లక్ష్మి పనే అయి ఉంటుంది. నువ్వు ఆరోజే కుంకుమభరిణె ఇచ్చి దానితో ముచ్చట లాడినప్పుడే అనుకున్నాను. ఇలాటిదేదో జరుగుతుందని. రేపు రానీ! దాని పని చెబుతా."

లత అదిరిపడింది. లక్ష్మి అంటే లతకి ఎంతో నమ్మకం. అది ఇలాటి పని ఎప్పుడూ చేయదు. ఉత్త అమాయకురాలు. అమ్మ దాన్ని ఏమంటుందో ఏమో ! ఆలోచిస్తూ లత తల్లితో అంది— "అది అలాటి కాదమ్మా! మనమే జాగ్రత్తగా చూస్తే ఇంట్లోనే దొరుకుతుంది. అనవసరంగా దానినెందుకు అనడం !"

"చాలా బాగుందే నీ ఉపన్యాసం. అసలు నేను అప్పుడే చెప్పేను. అయినా వెండిభరిణె దాని చేతులలో పెట్టడమేమిటి! వాళ్ళ తక్కువ బుద్ధులు ఎక్కడికి పోతాయి! గట్టిగా దబాయించి, నాలుగు అంటిస్తేసరి. చచ్చినట్లు అదే ఇచ్చేస్తుంది." అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.


"అమ్మో ! అమ్మ అన్నంతపనీచేస్తుంది. నిజంగా ఉత్త అమాయకురాలు లక్ష్మి" ఒక్క క్షణం దాని రూపం దీనంగా లత కళ్ళల్లో మెదిలింది.

నేనలాటి పని చెయ్యలేదని కడివెడు కన్నీళతో అంది. అమ్మను బ్రతిమాలుతున్నట్లు అనిపించింది. లక్ష్మి మంచితనంమీదనమ్మకం, దానిమీద అభిమానం లతను ఎంతోసేపు భరిణెకోసం ఇల్లంతా వెతికేటట్టు చేసేయి. ఫలితం లేదు, అనిపించినా లక్ష్మిమీద నమ్మకం మాత్రం సడలిపోలేదు లతకు. భరిణె ఏమై ఉంటుందో! తను ఊహించలేదుకాని, లక్ష్మి దాన్ని తీసుకోలేదని మాత్రం చెప్పగలదు. కాని తను ఎంత చెప్పినా ఎవరు వింటారు! లక్ష్మి పనిలోకి రాగానే మీనాక్షమ్మ దాన్ని భరిణె గురించి అడిగేసింది ఖచ్చితంగా నువ్వే తీసావని దండించడం మొదలు పెట్టింది. అమ్మ దానిమీదకోపంతో అగ్గిలా మండిపోతోంది. దాన్ని ఎన్నెన్ని మాటలంటోందో లత మనస్సులో ఒక్కొక్కటిగా బాధను కలిగిస్తున్నాయి. నిప్పుకు గాలి తోడయినట్లు అమ్మకు అన్నయ్య లిద్దరూ తోడై లక్ష్మిమీద చెయ్యి కూడా వేసుకున్నారు. ఇక సహించలేక బయటికి వచ్చింది లత. లతను చూసేసరికి లక్ష్మికి దుఃఖం పొంగి వచ్చింది.

"లతమ్మగారూ! మీరేనా చెప్పండి! నేను ఆ భరిణె తీయలేదని. నేను దొంగని కానమ్మా! నిజంగా చెబుతున్నా. నేను దొంగని కాను." వెక్కిళ్ళ మధ్యగా ఇవే మాటలంటోంది లక్ష్మి.

లత ఆ దృశ్యం చూడలేక పోయింది. అసలు వీళ్ళంతా మనుష్యులేనా! అనిపించింది ఆ క్షణాన ఆమెకు.

"ఇక్కడెందుకు ఏడుస్తావు. వెళ్లి భరిణె తీసుకురా!" అంటూ లక్ష్మిని సీధిలోకి నెట్టేసి తలుపు మూసేడు పెద్దన్నయ్య. లత మనస్సు భారంగా వుంది. కాలేజీకి వెళ్లినా లక్ష్మి తనమనసులో మెదులుతోంది. అమ్మా,



నూతన సంవత్సర ప్రత్యేక కానుక

**రు. 18 లకు 4 బ్యాండ్ల ట్రాన్సిస్టర్ రేడియో పొందండి**



రు. 310 విలువగల ఆధునిక జపాన్ మోడల్ ఏ.సి. కం—బ్యాటరీ సూపర్‌ఫైన్ జెనివా 4 బ్యాండ్ ట్రాన్సిస్టర్ రేడియో రు. 170 లకు లభిస్తుంది. అయితే మీరు ఉచితంగా స్టీరియో—హై—ఫై—రికార్డింగ్ లీడ్‌తో కేవలం రు. 18 లకే పొందగలరు. అన్నింటికంటే మొట్టమొదట అందుకోబడ్డ ఆర్డరునకు ఫోటోగ్రాఫిక్ కెమేరా ఇవ్వబడుతుంది. ఇంగ్లీషు లేక హిందీలో మీ ఆర్డరును పంపి నిజాన్ని పరీక్షించండి.

GENEVA ELECTRONICS (D 40)
130, New Dayal pur, Delhi-110051.




**బైద్యనాథ్ చ్యవనప్రాశ్ స్పెషల్**

- శరీర కండరములను బలపరుచును. శక్తివంతముగా చేయును.
- శరీరమునకు శక్తిని ప్రసాదించి రోగ క్షమతను కలుగచేసి, పునరుజ్జీవనము కలుగ చేయును.
- దగ్గు, జలుబు మొదలగు శ్వాసకోశ వ్యాధులనుండి కాపాడును.
- పాండు, మరియు కాల్షియం తగ్గుదలలో అత్యంత ప్రయోజనకారిగా నుండును.
- సహజమైన వనమూలికలచే తయారు చేయబడి నందున సులభముగా జీర్ణమగును.




**కుటుంబాని కంతటికీ ఉత్తమమైన ఆయుర్వేద టానిక్**

INTERMARK/CHS/137

## కుంకుమ భరిణె

అన్నయ్యా నిజంగా రాక్షసులలాగే ప్రవర్తించేరు. అది కూడా మనిషేనని మరచిపోయారు. అన్యాయంగా దాన్ని హింసించేరు. అమ్మ లక్ష్మిని పని మానిపించేస్తే దాని అమ్మా, అయ్యా కూడా దాన్ని ఏమంటారో!

తళతళా మెరిసే వెండి భరిణె చూస్తే దానికి ముచ్చట వేసింది. అంతేకాని దాన్ని దొంగిలించాలనే ఊహ దానికెందుకు వుంటుంది. ఆ భరిణె దాని చేతిలో వుంచి దానిచేత తను కుంకుమ బొట్టు పెట్టించుకున్నప్పుడు దాని కళ్ళు ఎంత ఆనందంతో మెరిసాయి. ఆ ముఖంలో దానికున్న కోరికేదో తీరిపోయిన సంతృప్తి ప్రస్ఫుటించలేదూ! కుంకుమభరిణె చూసి సరదాపడినంతమాత్రాన అది కనిపించకపోయేసరికి లక్ష్మే దొంగిలించిందనటం సబబు కాదు.

అమ్మా, అన్నయ్యలతో యెంతగానో వాదన పెట్టుకుంది. మనసు వుండబట్టక విషయం అంతా అక్కయ్యకు రాసింది. నాలుగు రోజుల తరువాత అక్కయ్య దగ్గర నుంచి అమ్మ పేర వచ్చింది ఉత్తరం. ఆ ఉత్తరం చూసేసరికి మండుటెండలో బీటలు వారిన పుడమి మీద తొలకరి జల్లు కురిసినట్లు, మనస్సులకు ఆహ్లాదం కలిగించే మలయ మారుతం మరీ మరీ గిలిగింతలు పెట్టినట్టు, అందమైన వీణపై మరింత అందమైన అంగుళులు కదలి మధురస్వరాలు పలికినట్టు, మరెన్నో కమ్మ కమ్మని అనుభూతులు మేళవించి, లతను అలరించింది. తను ఊహించినది నిజమే - లక్ష్మి దొంగ కాదు - లక్ష్మి పేదదైనంత మాత్రాన, కులం తక్కువయినంత మాత్రాన ఇష్టంవచ్చినట్టు అంచనా వేసుకోవడమే! ఇదేనా ఉత్తమ సంస్కారం! ఈ మాటలు అమ్మా, అన్నయ్యలతో అని తనేదో ఘనవిజయం సాధించినట్టు సంబరపడిపోయింది మీనాక్షమ్మకైతే లక్ష్మితో జరిగిన విషయం చెప్పి మళ్ళీ పనిలో చేర్చుకోవటానికి అభిమానం అడ్డు వచ్చింది కాని, నానిగాడు ఆటసామానులతోపాటు వెండి భరిణె తీసుకు వెళ్ళిపోయాడని అక్కయ్య వ్రాసిందని అమ్మా, అన్నయ్యలు తొందరపడటం పొరపాటని లక్ష్మితో చెప్పి మళ్ళీ దాన్ని పనిలో పెట్టేవరకూ లత మాత్రం ఊరుకోలేకపోయింది.